క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం


ప్రత్యేక అలంకరణలో పేరంటాలమ్మ

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ 68వ ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో అమ్మవా రి ఆలయ ఆవరణ లో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. అర్చకుడు సతీష్‌పై అమ్మవారు ఆవహించింది. అమ్మవారి విగ్రహంతో సతీష్ అగ్నిగుండ ప్రవేశం చేయగా, ఆయన వెంట భక్తులు అగ్నిగుండంలో నడిచారు. అమ్మవారి చీర, సారె, గాజులు, లడ్డూ ప్రసాదం కొనుగోలుకు భక్తులు పోటీ పడ్డారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారని ఆలయ కమిటీ పేర్కొంది. సీఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై ఆర్ శివాజీ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. గ్రామం యువత వలంటీర్లుగా భక్తులకు సేవలు అందించారు. భక్తులకు వైద్యం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యంతో పాటు వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించారు. గురువారం మహా అన్నదానం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ పేర్కొంది.

ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు


ఆర్ఓ ప్లాంట్

దెందులూరు: విద్యార్థులు, ఉపాధ్యాయులకు రక్షిత తాగునీరు అందించేందుకు ప్రముఖ పారిశ్రామిక వేత్త, స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ కలపాల చంద్రశేఖర్ (బుజ్జి) వితరణ రూ.లక్షతో గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. బుజ్జికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పీఈటీలకు సత్కారం


పీఈటీలను సత్కరించిన డీఈఓ వెంకటలక్ష్మమ్మ

దెందులూరు: రాష్ట్ర స్థాయిలో హైజంప్, ట్రిపుల్ జంప్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన పోతునూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం కృష్ణారావు, 800 మీటర్ల పరుగు హైజంప్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన కలపర్రు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి.విజయలక్ష్మిలను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారిని వెంకటలక్ష్మమ్మ సత్కరించారు. ప్రశంస పత్రం అందజేశారు. ఈ నెల ఫిబ్రవరి 8, 9 తేదీల్లో అనంతపురం పీటీసీ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కృష్ణారావు, జయలక్ష్మి పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. వీరు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని డీఈఓ ఆకాంక్షించారు.

అప్పనవీడు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదపాడు : కోనసీమ జిల్లాలోని మదర్ థెరిస్సా అకాడమీ నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో అప్పనవీడు హైస్కూల్ విద్యార్థులు ఏడుగురు, డాన్స్‌లో ఆరుగురు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా చిత్రలేఖన ఉపాధ్యాయులు ఎస్ రజనీకాంత్ మాట్లాడుతూ చిత్రలేఖనంలో రాణించడం వల్ల భవిష్యత్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అనుమానంతో భార్యపై దాడి

భీమడోలు: అనుమానంతో భార్య, అడ్డొచ్చిన అత్తామామలపై అల్లుడు దాడి చేసిన ఘటన పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామంలో జరిగింది. గాయాలైన బాధితులు ముగ్గుర్నీ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు భీమడోలు పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎంఎంపురానికి చెందిన బొడ్డు ఆలోసిస్ తన కుమార్తెను అదే గ్రామానికి చెందిన పూనూరి సత్యానందంకు ఇచ్చి వివాహం చేశారు. గల్ఫ్ దేశాలు వెళ్లి తిరిగొచ్చిన సత్యానందం స్వగ్రామంలోనే ఉంటున్నాడు. అయితే భార్యపై అనుమానంతో ఈనెల 9న అర్ధ రాత్రి ప్లాస్టిక్ వైర్‌తో తీవ్రంగా గాయపర్చాడు. అడ్డెళ్లిన అత్తామామలపైనా దాడి చేశాడు. బాధితులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో రైతుకు మేలు

- అర్హులకే పథకాల అమలు
- నకిలీ రైతులు, బినామీ లబ్ధిదారులకు అడ్డుకట్ట
- నెలాఖరు నాటికి ప్రతి రైతుకూ సంఖ్య జారీ


దుద్దేపూడిలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ ఆదిత్య

భీమడోలు: సంక్షేమ పథకాలు అర్హులకు అందించి, నకిలీలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు 11 అంకెల గల విశిష్ట సంఖ్యను జారీ చేయనుంది. నేరుగా లబ్ధి చేకూర్చేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో రైతుల వివరాలను నియోజకవర్గంలోని ప్రతి రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేస్తున్నారు. తర్వాత కౌలు రైతుల కూడా ఈ తరహా నెంబర్ జారీ చేయనున్నారు. 11 నెలల కాల పరిమితి గల నెంబర్ కేటాయిస్తారని అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలెన్నో..

ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి రైతు వ్యక్తిగత భూ వివరాలు నమోదు చేసి, ఆధార్ సంఖ్య తరహాలో ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నారు. ఈ సంఖ్య ద్వారా అవసరమైన సమయాల్లో అర్హులైన రైతులను అధికారులు గుర్తిస్తారు. వారికి పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాలపై రాయితీలు, పంట నష్టపరిహారం తదితరాలు అందజేస్తారు. సాగునీటి సంఘాల సమస్యలు, పంటల తెగుళ్లు, ఇతర వ్యవసాయ సలహాలు సైతం అధికారుల నుంచి నేరుగా పొందేందుకు అవకాశం ఉంటుంది.

మొరాయిస్తున్న సర్వర్లు

ఒకేసారి అన్ని రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు చేస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా రైతులకు ఓటీపీలు కూడా రావడం లేదు. రైతులు ఆర్‌ఎస్‌కేల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నమోదు ఇలా..

వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడే. రైతు ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానమై ఉండాలి. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలి. ఈ ఆధారాలతో రైతు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. నమోదు పూర్తి కాగానే రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ నెంబర్ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. అయితే కొందరు రైతుల ఫోన్ నెంబర్లు ఆధార్‌తో అనుసంధానం కాకపోవడంతో నమోదు ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. ఇక్కడ వరి పొలాలుండి ఇతర రాష్ట్రాల్లో ఉండే రైతులు తమ ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింకు చేయించుకోకపోవడం, సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న రైతుల నమోదు ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

28 లోగా విశిష్ట సంఖ్య



ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో 20 వేలకుపైగా ఉన్న రైతులకు ఈ విశిష్ట సంఖ్య ఇస్తాం. రైతుల ఆధార్ కార్డు, పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కు లింకైనా ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలి. ఈ నమోదు క్రమంలో మూడు సార్లు ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం.

– పి.ఉషారాజకుమారి, ఏడీఏ, వ్యవసాయశాఖ, భీమడోలు


విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు


కోడూరుపాడులో రైతు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

నియోజవకర్గంలోని సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం	రైతులు
భీమడోలు	12,750	4390
ఉంగుటూరు	24,350	10,500
నిడమర్రు	3,466	1031
గణపవరం	11,750	4,300

విద్యార్థుల సంఖ్యను పెంచాలి


పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. కిచెన్ గార్డెన్లను పరిశీలించి హెచ్‌ఎం పి.నిర్మలకుమారికి పలు సూచనలు చేశారు. చిన్నారులకు పోషకాహారం అందించేలా తగు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులు అందించడం పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో టీచర్ మండే సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఒన్‌టౌన్ ప్రాంతంలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 14న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ పేర్కొన్నారు. అగ్రహారం, కెనాల్ రోడ్డు, సత్యనారాయణ పేట, లంబాడీ పేట, వెన్నవల్లి వారి పేట, నవాబ్ పేట, బాలాజీ థియేటర్ ప్రాంతం, జంట కల్యాణ మండపాలు, రామకోటి ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. బుధవారం ఆయన్ని తన కార్యాలయంలో గాలాయగూడెం గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బోయపాటి గణేష్ ఆధ్వర్యంలో గాలాయగూడెం, నాగులదేవునిపాడు, అక్కిరెడ్డిగూడెంకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు కలిశారు. కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. పెన్షన్ల సర్వేలు చేస్తూ లబ్ధిదారులను పరోక్షంగా గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులకు తానతోపాటు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని అబ్బయ్య చౌదరి భరోసా కల్పించారు. పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, నాయకులు మల్లిక్, ఏడుకొండలు, రమేష్, సురేష్, శ్రీను, సందీప్, సాయి, వార్డు మెంబర్లు వన్నెకూటి రాజేష్, కొండపల్లి శ్రీధర్ ఉన్నారు.

మంచినీటి సమస్య రాకూడదు


కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ మనోజ్

గణపవరం (ఉంగుటూరు): రానున్న వేసవిలో ఉంగుటూరు మండలంలో ఎక్కడా మంచినీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధ చేయాలని ఎంపీడీఓ మనోజ్ అన్నారు. బుధవారం ఉంగుటూరు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కాల్వలు కట్టివేసే ముందు అన్ని గ్రామాల్లో చెర్వులను పూర్తి స్థాయిలో నింపుకునేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. శివారు ప్రాంతాలకు కూడా నీరందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలలో శానిటేషన్ పనుల నిర్వహణ, వోడీఎఫ్ ప్లస్ కార్యక్రమాలు, తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈవోపీఆర్‌డీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


భీమడోలులో చిన్నారుల కూచిపూడి నృత్యం

భీమడోలు: భీమడోలు గ్రామ దేవతల జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయాల ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో గ్రామ పెద్ద బండారు సత్యనారాయణ ఆర్థిక సాయంతో చిన్నారులచే భరతనాట్యం, కూచిపూడి, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. బాల నృత్యకళాకారులు లయబద్ధంగా నృత్యం చేస్తూ ఆహూతులను ఆకట్టుకున్నారు. కళాకారులు, చిన్నారులు, పెద్దలు, దాతలను దుశ్శాలువాలతో సత్కరించారు. కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు. బుధవారం భీమడోలులో మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుల గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన గణాచారులకు మహిళలు, భక్తులు పసుపు నీరు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు తరలి వెళ్లడంతో పురవీధులు కిటకిటలాడాయి.


అమ్మవార్ల ఘటాలతో ఊరేగింపు

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు చెక్కు అందిస్తున్న దాతలు

దెందులూరు: అన్ని దానాల్లో కెల్లా విద్యాదానం మహోన్నతమైందని, పట్టుదల, క్రమశిక్షణ నిరంతర సాధనతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించవచ్చని ఎస్‌ఆర్‌ఐ శ్రీధర్ అన్నారు. బుధవారం దెందులూరు గారపాటి హైమాతి దేవి ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో ఫస్ట్, సెకండ్ 100కు 98 మార్కులు సాధించిన రామిశెట్టి నాగమణిక్యం రూ.2000, మరిది పార్థుకు రూ.1500, ఇంగ్లీష్‌లో 100కు 98 మార్కుల సాధించిన షేక్ తనీషాకు రూ.1500 చెక్కులను ఆకుల నరసింహారావు ఉమాలక్ష్మి ట్రస్టు అధినేత ఎస్‌ఆర్‌ఐ శ్రీధర్ అందజేశారు. పాఠశాలలో స్టేజి నిర్మాణానికి రూ.లక్ష అందిస్తానని శ్రీధర్ హామీ ఇచ్చారు. నిర్మాణ పనులు ప్రారంభించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు ముందుకొచ్చిన దాతను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం మల్లికార్జునరావు ఉపాధ్యాయులు ఎస్ వెంకట్రాది, నారాయణరావు పల్లారెడ్డి, ఆశీర్వాదం గుల్లపూడి వెంకటేశ్వరరావు, సుధీర్ గణేష్, ప్రభుపాల్, కళ్యాణి, లావణ్య, బాలాజీ, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి


అధ్యాపకుడిని సన్మానిస్తున్న సిబ్బంది

గణపవరం: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చునని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం డిగ్రీ కాలేజిలో సైన్సు గ్రూపు విద్యార్థులకు కెమిస్ట్రీ సబ్జక్టుపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. అతిథి ఉపన్యాసకునిగా డీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీకాలేజి, తాడేపల్లిగూడెం రసాయనశాస్త్ర విభాగాధిపతి లెఫ్టినెంట్ ఎంవీ ప్రేమసాగర్ రసాయన శాస్త్ర ప్రాముఖ్యత, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రేమసాగర్‌ను మెమెంటోతో సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ చైతన్య పాల్గొన్నారు.

స్వచ్ఛ, స్వర్ణ పంచాయతీలే లక్ష్యం


పథకాల పురోగతిపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి

భీమడోలు: స్వచ్ఛ, స్వర్ణ గ్రామ పంచాయతీలు సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం సంక్షేమ పథకాల పురోగతిపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ మంచినీటి పథకాలు, హౌసింగ్, తడి, పొడి చెత్త సేకరణ, స్వచ్ఛ భారత్ మిషన్, ఇంటి పన్నుల వసూళ్లు, సర్వేలు, చిన్నారుల ఆధార్ నమోదు తదితర అంశాలపై చర్చించారు. ప్రతి నెలా మూడో శనివారం విధిగా స్వచ్ఛ, స్వర్ణ గ్రామ పంచాయతీలు లక్ష్యంగా గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి గురువారం పొడి, తడి చెత్తలను సేకరించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.సుబ్రహ్మణ్యం, ఈవోఆర్‌డీ కె.సుందరి, ఏపీఓ కె.పద్మ, హౌసింగ్ ఏఈ ఎం చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి


భీమడోలు : పాతూరులో బ్రోమోడలిన్ మందును అందిస్తున్న ఏఓ ఉషారాణి


పెదపాడు : ఎలుకల నివారణకు మందు పంపిణీ చేస్తున్న అధికారులు

భీమడోలు: సామూహిక ఎలుకల నివారణతోనే రైతులు ఆర్థిక స్వావలంబన సాధిస్తారని మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. మండలంలో రైతు సేవా కేంద్రాల ద్వారా బుధవారం రైతులకు ఉచితంగా 53 కేజీల బ్రోమోడలిన్ ఎలుకల నిర్మూలన మందును అందించారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులో ఆర్‌ఎస్‌కే వద్ద రైతుల సమక్షంలో తయారీ చేసిన బ్రోమోడలిన్ మందును పొట్లాలుగా కట్టి సాగు విస్తీర్ణం ఆధారంగా ఏఓ రైతులకు అందజేశారు. పొలం పిలుస్తుందిలో భాగంగా రైతులకు సాగు యాజమాన్య పద్ధతుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ షైలాభాను, రైతులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ

పెదపాడు : రైతులు ఎలుకల నివారణకు సామూహికంగా నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని అప్పనవీడు, కొత్తూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా అందించారు. కార్యక్రమంలో పావులూరి రామారావు, వడ్డి వాసవి, బెక్కం శ్రీనివాసరావు, కాశీ విశ్వనాథం, పల్లపోతు శ్రీనివాసరావు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి

ఏలూరు (టూటౌన్): వసతి గృహంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక పత్తేబాద్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు. వృద్ధులకు అందిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఉచిత న్యాయ సలహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 15100లో సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో వసతి గృహ మేనేజర్ తుమ్మలపల్లి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

గాయపడిన గంటలోపే చికిత్స అందించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు మొదటి గంటలో చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడగలమని ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనరు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. క్షతగాత్రులకు మొదటి గంట సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారని తెలిపారు. ఆ సమయంలో చికిత్స అందిస్తే ప్రాణాలు రక్షించవచ్చని, క్షతగాత్రుల్ని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాలను రక్షించిన వారికి రివార్డులు అందిస్తారని తెలిపారు. కొత్త చట్టాల ప్రకారం రహదారి ప్రమాదాలకు గురైన వారికి ఆసుపత్రుల్లో కొన్ని రూ.లక్షలపైనే వైద్యం ఉచితంగా అందించే వెసులుబాటు ఉందని చెప్పారు. శిబిరంలో జంగారెడ్డిగూడెం ఆర్టీఓ ఎండీ మదానీ, ఏలూరు కార్యాలయ సిబ్బంది, తదితరులు 20 మందికి పైగా రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ పీఆర్వో శ్రీనివాస్, వైద్యాధికారి, ఆరుగురు సభ్యుల వైద్య బృందం సహాయ సహకారాలు అందించారు.

కిసాన్ వికాస్ పత్రాలు పోయినవి

పులఖండం విజయలక్ష్మి W/o పసువరప్రసాద్ అను నేను పూళ్ళ గ్రామ నివాసిని. నాకు పూళ్ళ పోస్టాఫీసులో 10 కిసాన్ వికాస్ పత్రాలు KVP/45BC 433433 (Date:06-08-2007) to KVP/45BC 433442 వరకు కలవు. మా ఇల్లు మారే క్రమంలో అవి కనిపించకుండా పోయినవి. దయతో దొరికిన వారు 98481 49545 నెంబరుకు తెలియజేయగలరు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


ఆక్వా నిపుణుడు రవికుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న నాయకులు

గణపవరం: ఆక్వా సాగులో నిపుణుల సలహాలు పాటిస్తూ, యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే మంచి ఫలితాలు పొందవచ్చునని ఆక్వారంగ నిపుణుడు అమర్నేని రవికుమార్ రైతులకు సూచించారు. బుధవారం గణపవరంలో ఫడోరా ఆక్వా సంస్థ ఆధ్వర్యంలో గణపవరం, నిడమర్రు, ఉండి, ఉంగుటూరు, ఆకివీడు మండలాలకు చెందిన ఆక్వారైతులకు సాగుపద్ధతులపై సాంకేతిక విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో ఆయన మాట్లాడుతూ ఆక్వాసాగులో సాంకేతికతను ఉపయోగించుకోవాలని సూచించారు. నాణ్యమైన సీడ్‌ను ఎంచుకోవాలని, తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం ఆక్వా సాగు ఒడిదుడుకుల నుంచి క్రమంగా బయటపడుతుందని, చేపలు, రొయ్యల ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని అన్నారు. ఎం దిలీప్ కుమార్, ఎన్ ప్రసాద్, పి.శ్రీనివాసరావు తదితరులు రైతులకు ఆక్వాసాగులో మెళుకువలను వివరించారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక యూనిక్ కోడ్

గణపవరం(ఉంగుటూరు): వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రైతులందరికీ 11 నెంబర్లతో ప్రత్యేక యూనిక్ కోడ్‌ను కేటాయిస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్‌బాషా అన్నారు. బుధవారం ఉంగుటూరులో నిర్వహించిన రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఆధార్ తరహాలో ప్రతి రైతుకు యూసీ నెంబరు కేటాయిస్తారని, తొలిదశలో 5 కోట్ల మంది భూ యజమానులకు ఈ నెంబర్లు కేటాయిస్తారని చెప్పారు. తొలుత పీఎం కిసాన్ లబ్ధిదారులకు పార్మర్ రిజిస్ట్రీ నెంబర్లు జారీ చేస్తారని తెలిపారు. ఏడీఏ ఉషా రాజకుమారి, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ విడుదల

ఏలూరు టౌన్: యువత తమ స్నేహితులను గుర్తు చేసుకుంటూ స్నేహాంజలి పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ ఐఏఎస్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో బుధవారం స్నేహాంజలి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-12 పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తమ శక్తి, ప్రతిభను చాటుకుంటూ ఉపాధి, ఉద్యోగాల్లో స్థిరపడేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, స్ఫూర్తి కలుగుతాయని తెలిపారు. గత 12 ఏళ్లుగా మరణించిన తమ మిత్రుల జ్ఞాపకార్థం స్నేహాంజలి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం సంతోషంగా ఉందని ఎన్‌జీఓ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు అన్నారు. ట్రాఫిక్ సార్జెంట్ అమలేశ్వరరావు, ఫూచర్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ సతీష్ సావిత్రి సారెల్లా పాల్గొన్నారు.